సీనియర్ జర్నలిస్టు కోల జనార్ధన్ సారధ్యంలో ...
TEL TEL/2014/58777
MUNNURUKAPU GLOBAL NETWORK
మున్నూరుకాపు న్యూస్
బుధవారం, 14 అక్టోబర్ 2026



వ్యాపార సామ్రాజ్యానికి నాందిగా 'సమాఖ్య' సదస్సు

నేడే ఘన ప్రారంభం

ప్రారంభించనున్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రులు

ముఖ్య అతిథిగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాస్వన్

ముగింపు వేడుకలకు మెగాస్టార్, పద్మభూషణ్ కొణిదెల చిరంజీవి హాజరు

హైటెక్స్‌లో నేటి నుంచి రెండు రోజుల పాటు ప్రతిష్టాత్మక ఈవెంట్











హైదరాబాద్, అక్టోబర్ 13 (మున్నూరు కాపు న్యూస్):

బహుజన కులాల వ్యాపార శ్రేయస్సు, పారిశ్రామిక అభివృద్ధే ధ్యేయంగా అడుగులు వేస్తున్న ప్రతిష్టాత్మక 'సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్' సదస్సుకు భాగ్య నగరం వేదికైంది. సరికొత్త వ్యాపార సామ్రాజ్యాల స్థాపనకు నాంది పలుకుతూ హైటెక్స్‌లో నిర్వహించనున్న ఈ మహా సదస్సు నేడు (బుధవారం) అత్యంత వైభవంగా ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని సమాఖ్య ప్రతినిధులు వెల్లడించారు.

ముఖ్య అతిథుల సమక్షంలో ప్రారంభోత్సవం:

ఈ మెగా ఈవెంట్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రులు కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాస్వన్ హాజరుకానున్నారు. అలాగే కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు,ఆహార మరియు ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ, సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వ శాఖలకు చెందిన కేంద్ర మంత్రులు తమ ప్రత్యేక సందేశాలను అందించనున్నారు. వీరితో పాటు తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ అధికారిక మరియు అనధికారిక ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన నున్నారు.

వ్యాపార మార్గదర్శకత్వం – విక్రయశాలలు:

అక్టోబర్ 14, 15 తేదీలలో (రెండు రోజుల పాటు) జరిగే ఈ సమాఖ్య సదస్సుకు దేశవ్యాప్తంగా 3 వేలకు పైగా ప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ సదస్సులో మీవీజులు, స్కిల్ డెవలప్‌మెంట్, ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ (మహిళా సాధికారత), స్టార్టప్ కంపెనీల ప్రోత్సాహం మరియు గైడెన్స్ వంటి విభిన్న అంశాలపై జాతీయ, అంతర్జాతీయ అనుభవజ్ఞులతో ప్రత్యేక ఉపన్యాసాలు, చర్చాగోష్టులు ఉంటాయి. అలాగే, ఈ సదస్సులో ఏర్పాటు చేయబోయే వివిధ రకాల ప్రదర్శనలు మరియు విక్రయ శాలలు (ఎగ్జిబిషన్ స్టాల్స్) ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

కులాల ఐక్యవేదికగా వ్యాపార ప్రగతి:

కాపు, తెలగ, బలిజ, మున్నూరు కాపు, తూర్పు కాపు కులాల వ్యాపారవేత్తల ఐక్యవేదికగా ఈ మహాసభలు సాగనున్నాయి. ఈ బృహత్తర కార్యక్రమానికి ఆలిండియా తెలగ బలిజ కాపు సంఘం, విశ్వ సమాఖ్య మరియు పటేల్ ఆంట్రప్రెన్యూర్స్ నెట్‌వర్క్ తమ పూర్తి సహకారాన్ని అందిస్తున్నాయి.

చివరి రోజు మెగా ఆకర్షణ: పద్మభూషణ్ చిరంజీవి

రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సు ముగింపు వేడుకలు (అక్టోబర్ 15న) మరింత ఘనంగా జరగనున్నాయి. ఈ ముగింపు కార్యక్రమానికి పద్మభూషణ్, మెగాస్టార్ కొణిదెల చిరంజీవి గారితో పాటు మరికొందరు ప్రముఖులు హాజరై, యువ వ్యాపారవేత్తలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు.

సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సదస్సు సరికొత్త పారిశ్రామిక విప్లవానికి, యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు బాటలు వేస్తుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.